ఎస్‌బీఐ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

ఉప్పల్‌: ఉప్పల్‌ ఎస్‌బీఐ కాలనీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహమ్మద్‌ గఫూర్‌, ఉపాధ్యక్షుడిగా రమేష్‌ గౌడ్‌, కార్యదర్శిగా సందీప్‌ భూషన్‌, కోశాధికారిగా చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా వెంకటేశ్వర్లు, వినోద్‌కుమార్‌, మనోజ్‌ కుమార్‌, విజయ్‌కుమార్‌, రాజమణి ఎన్నికయ్యారు. కాలనీ సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గం పేర్కొంది.

రేపు గరికపాటి ప్రవచనం

గౌతంనగర్‌: ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని శ్రీశంకర తత్వ సేవా సంస్థ, ధర్మసేన, ఆర్యవైశ్య సంఘం మల్కాజిగిరి, బీఎస్‌ఎస్‌, సమాఖ్య, బీజేపీ ధార్మిక, లీగల్‌ సెల్‌ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం పద్మశ్రీ డాక్టర్‌ గరికపాటి నర్సింహారావుచే ప్రవచనాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గౌతంనగర్‌ డివిజన్‌ పరిధిలోని లక్ష్మీసాయి గార్డెన్స్‌లో ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌.రామచందర్‌ రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌, పలువురు నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



అల్వాల్‌: అల్వాల్‌లోని శ్రీనగరేశ్వర స్వామి సహిత వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకంతో పాటు అర్చన కార్యక్రమాలు, జగన్మాతకు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్‌ అధ్యక్షులు సిరిపురం ఆనంద్‌బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యాత్రా దానానికి ముందుకు రావాలి



వివరాలు వెల్లడిస్తున్న డీఎం కవిత

బోడుప్పల్‌: ఆర్థికంగా వెనకబడిన పేదలు, వృద్ధులు వికలాంగులు, విద్యార్థుల కోసం యాత్ర దానం చేయడానికి దాతలు ముందుకు రావాలని ఆర్టీసీ చెంగిచర్ల డిపో మేనేజర్‌ కవిత అన్నారు. చెంగిచర్ల డిపోలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ ఆదాయాన్ని పెంచుకునే చర్యల్లో భాగంగా ఎండీ సజ్జనార్‌ ఆదేశాలతో టూర్‌ ప్యాకేజీలు, యాత్ర దానం తదితర కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. స్వచ్ఛంద సంస్థలు సేవా భావం కలిగిన నాయకులు సామాజిక సేవల్లో ఆసక్తి ఉన్న వారు పేదల కోసం తీర్థ యాత్రలు, విద్యార్థుల కొరకు విజ్ఞాన విహార యాత్రల కొరకు యాత్ర దానం చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌ డే వేడుకలు



అల్వాల్‌: మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ బండి రాజు, అధ్యాపక బృందం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు నూతన విద్యార్థులకు స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వ శక్తితో ఎదగాలి

కుషాయిగూడ: స్వయం ఉపాధిని ఎంచుకుని పలువురికి ఉపాధి కల్పించాలని ఉప్పల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మీర్‌పేట్‌ హౌసింగ్‌ బోర్డ్‌లో సురేష్‌ వాటర్‌ వాష్‌ సెంటర్‌ను ఏర్పాటు చేశాడు. ముఖ్య అతిథిగా హాజరైన పరమేశ్వర్‌రెడ్డి ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నేతలు సాయి కిరణ్‌గౌడ్‌,శ్రీనివాస్‌ ముదిరాజ్‌, కిషోర్‌, ఉదయ్‌ కిరణ్‌, మల్లేష్‌, సురేష్‌గౌడ్‌, అజీజ్‌, విఠల్‌ నాయక్‌, ఆకాష్‌, వెంకన్నగౌడ్‌, తదితరులు పాల్గొన్నారు.



వాటర్‌ వాష్‌ సెంటర్‌ ప్రారంభోత్సవంలో పాల్గొన్న పరమేశ్వర్‌రెడ్డి

ప్రకటించి ఆరేళ్లు.. అమలుకు ఎన్నేళ్లు..?

మధ్యాహ్న భోజనానికి నోచుకోని ఇంటర్‌ విద్యార్థులు

- అర్ధాకలితో విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- శివారు మేడ్చల్‌ జిల్లాలో 4 ప్రభుత్వ, 2 ఎయిడెడ్‌ కాలేజీలు 2,650 మంది విద్యార్థులు



సాక్షి,మేడ్చల్‌ జిల్లా: ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోషకాహారం అందించాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినప్పటికీ నేటికీ పథకం అమలుకు నోచుకోకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజనం పథకం అమలైతే.. నగర శివార్లలోని వివిధ ప్రాంతాల నుంచి మండల కేంద్రాలకు చదువుకునేందుకు వెళ్లే ఇంటర్‌ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం ఉండనుంది. ఇది కార్యరూపం దాల్చకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో మధ్యాహ్నభోజనం అమలు చేస్తామని గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఆరేళ్ల క్రితం ప్రకటించింది. ఇప్పటికీ పట్టాలెక్కకపోవడంతో జిల్లాలోని విద్యార్థులు నష్టపోతున్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇంటర్‌ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు పరిచే విషయంపై శ్రద్ధ చూపాలని వారి తల్లిదండ్రులు ,విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. నగర శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో నాలుగు ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలు ఉండగా, రెండు ఎయిడెడ్‌ కాలేజీలు ఉన్నాయి. ఈ కాలేజీల్లో 2,650 మంది విద్యార్థులు చదువుతున్నారు. షిఫ్టు సిస్టమ్‌లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కళాశాల తరగతులు నిర్వహిస్తున్నారు. శివారు ప్రాంతాల్లోని చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు దినసరి కూలీ పనులతో పాటు వివిధ పరిశ్రమల్లో అసంఘటిత కార్మికులుగా పని చేస్తున్నారు. మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్‌, మేడ్చల్‌లో ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలు ఉన్నప్పటికిని, అవి షిఫ్టు సిస్టమ్‌లో నడుస్తున్నాయి. ఉదయం ఇంటర్‌ తరగతులను నిర్వహిస్తుండగా, మధ్యాహ్నం తర్వాత డిగ్రీ కళాశాలల తరగతులు కొనసాగుతున్నాయి. బొల్లారం, అల్వాల్‌ ప్రాంతాల్లో ప్రభుత్వ ఎయిడెడ్‌ కళాశాలలు ఉన్నాయి. ప్రతిరోజు షిఫ్టు సిస్టమ్‌లో ఇంటర్‌ తరగతులు కొనసాగుతుండటంతో... ఇందులో చదువుతున్న విద్యార్థులు ఉదయాన్నే కాలేజీలకు రావాల్సి వస్తోంది.దీంతో ఉదయం పూట ఇంట్లో భోజనం తయారు కాక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఫలితంగా కళాశాలలకు వెళ్లుతున్న ఇంటర్‌ విద్యార్థులు అర్ధాకలితో అలమటించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఆకలి కారణంగా అధ్యాపకులు బోధిస్తున్న పాఠాలు విద్యార్థులకు అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే ఇంటర్‌ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల, విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా ఇంటర్మీడియెట్‌ అధికారి కిషన్‌ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్‌ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అనుమతి రాగానే అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఫేస్‌ రికగ్నైజేషన్‌ సిస్టమ్‌ అప్‌డేట్‌ చేయండి

ప్రిన్సిపాళ్ల సమావేశంలో అదనపు కలెక్టర్‌ రాధికా గుప్తా



సాక్షి,మేడ్చల్‌ జిల్లా: ఎస్సీ,ఎస్టీ ఇంటర్‌ విద్యార్థుల డిజిటల్‌ కీ ఫర్‌ స్కాలర్‌ షిప్‌ ఆన్‌లైన్‌లో ఫేస్‌ రికగ్నైజేషన్‌ సిస్టమ్‌ అప్‌డేట్‌ చేస్తేనే జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ పోర్టల్‌లోకి వస్తుందని, ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాళ్లను మేడ్చల్‌– మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్‌ రాధికగుప్తా ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు ,ప్రిన్సిపాళ్లలతో ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.జిల్లాలో మండలాల వారీగా ప్రతి కాలేజీలో పెండింగ్‌పై ఎదురవుతున్న కారణాలను అదనపు కలెక్టర్‌ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్‌ థీమ్‌ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. వారం రోజుల్లో పోర్టల్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కొన్ని కాలేజీల్లో ఎక్కువ శాతం పెండింగ్‌ ఉండటానికి వలస విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండడమేనని ప్రిన్సిపాళ్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో ఇన్‌ యాక్టివేట్‌ నుంచి యాక్టివేట్‌ చేయడంలో, డ్రా బాక్స్‌కు పంపడంలో, ఎస్‌ఎస్‌సీ మెమో ప్రకారం ఆధార్‌లో వివరాలు లేకపోవడం వల్ల కొంత జాప్యం జరుగుతుందని అదనపు కలెక్టర్‌ దష్టికి ప్రిన్సిపాళ్లు తీసుకు వచ్చారు. ఆన్‌లైన్‌లో సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్‌ రాధికా గుప్తా తెలిపారు. కాలేజీలలో ఉత్తీర్ణత శాతాన్ని 80 శాతానికి తగ్గకుండా పెంచడంతోపాటు అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూనియర్‌ కాలేజీల్లో అవసరమైన తాగునీరు, లైటింగ్‌, ఫ్యాన్లు డ్రైనేజీ, వాటర్‌ లీకింగ్‌, విండోస్‌ వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే.. తప్పనిసరిగా పరిష్కరిస్తామన్నారు. సమావేశంలోజిల్లా ఇంటర్మీడియెట్‌ అధికారి కిషన్‌, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్‌ కుమార్‌, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

హైమాస్ట్‌ స్తంభానికి మరమ్మతులు


తుప్పు పట్టినా స్పందించరా ?

సాక్షిలో ప్రచురితమైన వార్త



మరమ్మతులు చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్‌..

మల్లాపూర్‌: మల్లాపూర్‌ అంబేడ్కర్‌ విగ్రహ సమీపంలోని హైమాస్ట్‌ విద్యుత్‌ స్తంభం కిందిభాగం తుప్పు పట్టి ప్రమాదకరంగా మారిందని శుక్రవారం 'సాక్షి' దిన పత్రికలో తుప్పు పట్టినా స్పందించరా? అనే కథనానికి విద్యుత్‌ శాఖఅధికారులు స్పందించారు. వెంటనే తుప్పు పట్టిన వరకు స్తంభాన్ని కట్‌ చేసి మళ్లీ యధావిధిగా సరిచేసి సిమెంట్‌ దిమ్మెను ఏర్పాటు చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన 'సాక్షి' దిన పత్రికకు, విద్యుత్‌ అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

జలమండలి అధికారులతో కార్పొరేటర్‌ సమీక్ష



సమీక్ష సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్‌ బన్నాల గీత తదితరులు

ఉప్పల్‌: జలమండలి అధికారులతో చిలుకానగర్‌ కార్పొరేటర్‌ కార్యాలయంలో కార్పొరేటర్‌ బన్నాల గీత ప్రవీణ్‌ శుక్రవారం అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మురుగు నీటి సమస్య, మంచినీటి సమస్య, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పలు ప్రాంతాల్లో సరైన డ్రైనేజి వ్యవస్థ లేదని, మరికొన్ని ప్రాంతాల్లో పాత పైపులైన్ల స్థానంలో కొత్త పైపులైన్లు వేయాలని కోరారు. దీనిపై అధికారులు స్పందిస్తూ వెంటనే సమస్య ఉన్న ప్రాంతాల్లో పర్యటించి తగు చర్యలు తీసుకుంటామని, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం రజినీకాంత్‌ రెడ్డి, మేనేజర్లు సత్యనారాయణ, లావణ్య, బీఆర్‌ఎస్‌ నేత బన్నాల ప్రవీణ్‌ కుమార్‌ పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

బోడుప్పల్‌: పెంటారెడ్డి కాలనీలో శ్రీమాతా నిమిషాంబాదేవి శ్రీ శరన్నవ రాత్రి ఉత్సవాల కరపత్రాన్ని శుక్రవారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్‌ వినోద్‌కుమార్‌ మాట్లాడుతూ ఈనెల 22 నుంచి అక్టోబర్‌ 2 వరకు ఉత్సవాలను నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శులు అశోక్‌కుమార్‌, శ్రీనివాస్‌, రాష్ట్ర నకాష్‌ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచర్ల శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాన్ని తరలించొద్దు



డాక్యుమెంట్‌ రైటర్లకు మద్దతు తెలుపుతున్న కార్పొరేటర్‌ శ్రవణ్‌

మల్కాజిగిరి: మల్కాజిగిరి సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయాన్ని ఇంటిగ్రేటెడ్‌ క్యాంపస్‌కు తరలించడాన్ని వ్యతిరేకిస్తున్నామని మల్కాజిగిరి డివిజన్‌ కార్పొరేటర్‌ శ్రవణ్‌ అన్నారు. నేరెడ్‌మెట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న డ్యాకుమెంట్‌ రైటర్లను కలిసి మద్దతు పలికారు. ఈ సందర్భంగా శ్రవణ్‌ మాట్లాడుతూ మల్కాజిగిరిలో జిల్లా కోర్టుకే శాశ్వత భవనం ఏర్పడుతున్నదన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోనే పూర్తి స్థాయిలో భవనాన్ని నిర్మించాలన్నారు. దశాబ్దాలుగా జీవనోపాధి పొందుతున్న రైటర్స్‌ , ఇతర సిబ్బంది ఉపాధి కోల్పోతారన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌, నరేష్‌,నవీన్‌,ఈశ్వర ప్రసాద్‌, రంజిత, మహేష్‌, నాజిర్‌, వంశీధర్‌ పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో గౌతమ్‌ స్కూల్‌ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో గౌతమ్‌ స్కూల్‌ డీన్‌, ప్రిన్సిపాల్‌

కుషాయిగూడ: 69వ ఎస్‌జీఎఫ్‌ జోనల్‌ స్థాయి క్రీడా పోటీల్లో డాక్టర్‌ కెకెఆర్‌ గౌతమ్‌ స్కూల్‌ విద్యార్థులు సత్తా చాటారు.అండర్‌ 17 బాలికలు వాలీబాల్‌లో ప్రథమ స్థానం, అండర్‌14 బాలుర వాలీబాల్‌ ద్వితీయ స్థానం, అదే విధంగా అండర్‌ 14 బాలురు ఖోఖోలో ప్రథమ స్థానం, అండర్‌ 17లో బాలికలు ఖోఖో విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. 24 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం విజేతలను డీన్‌ శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్‌ శుభాంగిరావు, అకాడమీ ప్రిన్సిపాల్‌ అన్వర్‌ అభినందించారు.

అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌

కాప్రా: 69వ ఎస్‌జీఎఫ్‌ జోనల్‌ టోర్నమెంట్‌లో కబడ్డీ, వాలీబాల్‌ పోటీల్లో విజయ హైస్కూల్‌ విద్యార్థులు సత్తా చాటారు. వాలీబాల్‌ పోటీల్లో బాలికల జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. గెలిచిన విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే కబడ్డీ పోటీలకు అర్హత సాధించారు. శుక్రవారం విద్యార్థులను పాఠశాల డైరెక్టర్‌ కొప్పునూరి వీణ, పద్మావతి, ప్రిన్సిపాల్‌ దేవినేని వెంగ బాబు అభినందించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న నెమలి అనిల్‌కుమార్‌

మల్లాపూర్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని గ్రేటర్‌ కాంగ్రెస్‌ సీనియర్‌ నేత నెమలి అనిల్‌కుమార్‌ అన్నారు. గతంలో ఓల్డ్‌ మల్లా పూర్‌లోని ఎస్సీబస్తీలో బస్తీబాట కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన డ్రైనేజీ సమస్యను ఉప్పల్‌ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డికి తీసుకువెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి పనులను ప్రారంభించారు. శుక్రవారం డ్రైనేజీ పనులను నెమలి అనిల్‌కుమార్‌ పరిశీలించారు. కార్య క్రమంలో జిల్లా ఎస్సీ సెల్‌ సలహాదారులు పీజీ.సుదర్శన్‌, కాం గ్రెస్‌ నేతలు మక్తాల బాలరాజ్‌గౌడ్‌, రాజేష్‌, శివ, బస్తీవాసులు గణేష్‌, రఘు, ప్రసా ద్‌,సురేష్‌, నవీన్‌ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ కాలనీలో పైప్‌లైన్‌ మార్చండి

మౌలాలి: డివిజన్‌ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో చిన్నపాటి వర్షం వచ్చినా స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రోడ్ల విస్తీర్ణానికి అనుగుణంగా పైప్‌లైన్‌ మార్చాలని స్థానిక కార్పొరేటర్‌ సునీతయాదవ్‌ కోరారు. జీహెచ్‌ఎంసీ ఏఈ మధురిమతో కలిసి శ్రువారం ఆమె ఆర్టీసీ కాలనీ, షాదుల్లానగర్‌ ప్రాంతాల్లో పర్యటించారు. అవసరమైన చోట రోడ్లు, పైప్‌లైన్లను వేయాలని సూచించారు. కార్యక్రమంలో శేఖర్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

మేడ్చల్‌: పలు కేసుల్లో మేడ్చల్‌ ఎక్సైజ్‌ పోలీసులు సీజ్‌ చేసిన వాహనాలను వేలం వేయనున్నట్లు ఎక్సైజ్‌ సీఐ నవనీత తెలిపారు.ఈనెల 16న మేడ్చల్‌ ఎక్సైజ్‌ స్టేషన్‌ ఆవరణలో మూడు ద్విచక్రవాహనాలు వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు స్టేషన్‌ లో సంప్రదించి వేలంలో పాల్గొనాలని కోరారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

కీసర: కీసర మండలం పరిధిలోని నాగారంలోని సర్వే నెంబర్‌–83లో ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం తహసీల్దార్‌ అశోక్‌కుమార్‌ ఆధ్వర్యంలో కూల్చివేశారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యాదవులకు స్థలం కేటాయించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సుందర్‌యాదవ్‌

అల్వాల్‌/మల్కాజిగిరి: కుల వృత్తిని కొనసాగిస్తున్న యాదవులకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలని నేరెడ్‌మెట్‌ యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి పూలపల్లి సుందర్‌ యాదవ్‌ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మల్కాజిగిరి మండల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సుందర్‌ యాదవ్‌ మాట్లాడుతూ మల్కాజిగిరి సర్కిల్‌గా మారినప్పటికీ ఓల్డ్‌ నేరెడ్‌మెట్‌ ప్రాంతంలో సుమారు 213 యాదవ కుటుంబాలు పాల వ్యాపారం చేస్తున్నారన్నారు. ఇంటి వద్ద తగిన స్థలం లేకపోవడంతో బయట గోవులను, గేదెలను కట్టివేయడం వలన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పశు వ్యర్థాలతో శానిటేషన్‌ నిర్వహణ కూడా కష్టంగా మారిందన్నారు. రజకులకు దోబీఘాట్‌ కోసం స్థలాన్ని ప్రభుత్వం కేటాయిస్తున్నాదని అదే తరహాలో యాదవులకు పశువుల కొట్టాల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలన్నారు. మల్కాజిగిరిలో కొన్ని సర్వే నెంబర్లలో ఖాళీ స్థలం ఉందని అక్కడ కేటాయిస్తే బయోగ్యాస్‌ కూడా ఏర్పాటు చేసి యాదవులకు జీవనోపాధి కల్పిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్‌, సతీష్‌యాదవ్‌, హరికృష్ణ యాదవ్‌, మోహన్‌యాదవ్‌, ఎల్లేష్‌ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



మాట్లాడుతున్న మండల విద్యాధికారి సురేష్‌

మల్కాజిగిరి: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని మల్కాజిగిరి మండల విద్యాధికారి సురేష్‌ అన్నారు. మండల పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ , ప్రైవేట్‌ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రంగంలో ప్రముఖులైనా విద్య నేర్పించేది గురువులేనన్నారు. ప్రస్తుతం విద్యారంగంలో అనేక మార్పులు జరిగాయని, ఉపాధాయులు కొత్త విధానాలను నేర్చుకొని పాఠాలు బోధించాలన్నారు. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో, క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యమన్నారు. సన్మానం అందుకున్న వారిలో సిహెచ్‌ భాగ్యలక్ష్మి,కల్పన, విజయలక్ష్మి, మోహన్‌ నాయక్‌, నర్సింహారెడ్డి, ఫర్హాత్‌, గోవిందమ్మ, నిర్మల, బి.శ్రీనివాస్‌, శివకుమార్‌, ప్రైవేట్‌ ఉపాధ్యాయులు ఖాజా గౌసుద్దీన్‌, రజని చంద్రశేఖర్‌, పద్మజ, ఉమాదేవి, జయరాం, శారదా రాజేశ్వర్‌ ఉన్నారు.

సీతారాం ఏచూరి సేవలు ఎనలేనివి



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మల్కాజిగిరి: కామ్రేడ్‌ సీతారాం ఏచూరి సేవలు ఎనలేనివని సీపీఎం సీనియర్‌ నాయకుడు కృపాసాగర్‌ అన్నారు. మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్‌ ఆధ్వర్యంలో శుక్రవారం మల్కాజిగిరి చౌరస్తాలో ప్రథమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృపాసాగర్‌, లక్ష్మణ్‌ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సీతారాం ఏచూరి బాటలో నడవాల్సిన అవసరముందన్నారు. మతతత్వ బీజేపీకి వ్యతిరేకంగా వామపక్షపార్టీలతో పాటు ఇతర పార్టీలను ఐక్యం చేసి ఇండియా కూటమి ఏర్పాటు చేశారన్నారు. అగ్రవర్ణానికి చెందిన వ్యక్తి అయినా చివరి వరకు అణగారిన వర్గాల ఐక్యతకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కొండల్‌, శ్రీనివాస్‌, సూర్యకుమార్‌, హేమలత, సుమలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అల్వాల్‌: వెంకటాపురంలోని మహాబోధి విద్యాలయలో పాఠశాల విద్యార్థులకు శుక్రవారం తెలంగాణ తిరువళ్లువార్‌ తమిళ సంఘం సహకారంతో మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, ఐలాండ్‌ ఆస్పత్రి, ఎలైట్‌ స్మైల్‌ వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌ వెన్నెల గద్దర్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ నాణ్యమైన ఆహారం తీసుకోవాలన్నారు. డాక్టర్‌ అరుణ్‌రెడ్డి, డాక్టర్‌ రిత్విక్‌, డాక్టర్‌ మహేష్‌, డాక్టర్‌ మిథున్‌, డాక్టర్‌ మీనాక్షి, డాక్టర్‌ నవ్య, ప్రవళిక, ప్రిన్సిపల్‌ భవాని, రాము, తెలంగాణ తిరువళ్లువార్‌ తమిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు సమగ్ర సేవలు అందించాలి

సాక్షి,మేడ్చల్‌ జిల్లా: ప్రతి గర్భిణికి ప్రాథమిక స్థాయిలో నుంచే సమగ్ర సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య, ఆరోగ్య సిబ్బందిపై ఉందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.ఉమాగౌరి అన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జిల్లాలో నమోదైన మాతా మరణాలపై ఆమె సమగ్రంగా చర్చించారు. ఏప్రిల్‌, మే నెలల్లో పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తల్లుల మరణాలు చోటు చేసుకోవడంపై ఆరా తీశారు.సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, మహిళా ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ ఉమాగౌరి మాట్లాడుతూ హైరిస్క్‌ గర్భిణి స్త్రీలలో సంభవించే రక్తహీనత, హైబీపీ, ఇతర ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి,నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మొదటి కాన్పును హైరిస్క్‌ కేసుగానే గుర్తించి బర్త్‌ ప్లానింగ్‌ చేయాలని వైద్యులకు సూచించారు. సమయానికి రిఫెరల్‌ చేయడం, ఎమర్జెన్సీ ట్రాన్స్‌పోర్ట్‌ సౌకర్యం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులను ఆదేశించారు. భవిష్యత్తులో మాత మరణాలు జరగకుండా జిల్లాలో అన్ని స్థాయిల వైద్యాధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా డిప్యూటీ డి.ఎంహెచ్‌ఓలు డాక్టర్లు సత్యవతి, గీత, ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు మల్లీశ్వరి, స్వర్ణలత, గైనకాలజిస్ట్‌ సంబంధిత ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, మహి ళ ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.